సాక్షి రంగారెడ్డి

మంగళవారం । 2 । సెప్టెంబర్ । 2025



ఒడిశా టు హైదరాబాద్

ఒడిశా నుంచి హైదరాబాద్‌కు ఆర్టీసీ బస్సుల్లో గంజాయి తరలిస్తున్న ముఠాను పోలీసులు పట్టుకున్నారు. 8లో▸



డిప్యూటేషన్ రద్దు చేయండి

ఉపాధ్యాయుల డిప్యూటేషన్‌ను వెంటనే రద్దు చేయాలని నక్కర్తమేడిపల్లి గ్రామస్తులు డిమాండ్ చేశారు. 8లో▸



గోరీలు ధ్వంసం!

శ్మశానవాటికలోని గోరీలను కూల్చేసి, బొందలు తవ్వి, అందులోని అస్తికలు మాయం చేశాడు ఓ రియల్ వ్యాపారి. 8లో▸

న్యూస్‌రీల్

మైసిగండి మైసమ్మ సన్నిధిలో శాసనసభ స్పీకర్



కడ్తాల్: మండల పరిధిలోని మైసిగండి మైసమ్మ దేవాలయాన్ని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ సోమవారం దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఆయనకు నిర్వాహకులు శాస్త్రోక్తంగా వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం స్పీకర్ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చక సిబ్బంది, నిర్వాహకులు ఆయనను ఘనంగా సన్మానించి అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్టీ శిరోలీ, ఈవో స్నేహలత, సిబ్బంది, నిర్వాహకులు పాల్గొన్నారు.

సంచార చేపల విక్రయ వాహనం అందజేత



వరలక్ష్మికి వాహనం అందిస్తున్న మంత్రి సీతక్క

ఆమనగల్లు: తలకొండపల్లి మండలం వెల్జాల గ్రామానికి చెందిన వరలక్ష్మికి మంత్రులు సీతక్క, వాకిటి శ్రీహరి సోమవారం సంచార చేపల విక్రయ వాహనం అందజేశారు. హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో జరిగిన కార్యక్రమంలో మంత్రుల చేతుల మీదుగా ఆమె వాహనం కీ అందుకున్నారు. కార్యక్రమంలో డీపీఎం నర్సింహ, ఐకేపీ ఏపీఎం రామస్వామి, సీసీ లక్ష్మయ్య తదితరులు ఉన్నారు.

'లక్ష్మీదేవిపల్లి' పనులు చేపట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాఘవాచారి

షాద్‌నగర్‌రూరల్: లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణ పనులు చేపట్టేందుకు ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్ రాఘవాచారి డిమాండ్ చేశారు. పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడుస్తున్నా లక్ష్మీదేవిపల్లి పనులు చేపట్టలేదని, రిజర్వాయర్ నిర్మాణాన్ని మాటలకే పరిమితం చేస్తోందని విమర్శించారు. ఏదుల డిండి పథకానికి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రూ.1,832 కోట్లు కేటాయించి నల్లగొండకు నీళ్లు తరలించే యత్నం చేస్తోందని, రూ.232 కోట్లతో ఎస్‌ఎల్‌బీసీ కాలువకు లైనింగ్ పనులు చేపడుతోందని, లక్ష్మీదేవిపల్లిని మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. గత పాలకులు ప్రాణహిత చేవెళ్ల రీడిజైన్‌లో చేవెళ్ల లేకుండా, పాలమూరు రంగారెడ్డి రీడిజైన్‌లో లక్ష్మీదేవిపల్లి లేకుండా చేశారని అన్నారు. పాలమూరు రంగారెడ్డిని నల్లగొండకు పంపకుండా జూరాల నుంచి నీటిని తెచ్చి లక్ష్మీదేవిపల్లిలో కలపాలని డిమాండ్ చేశారు. ప్రజాప్రయోజనాల కోసం ఉపరాష్ట్రపతి ఎన్నికలో ఇండియా కూటమి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి ఓటువేసేందుకు ఎంపీలు ముందుకు రావాలని కోరారు.సమావేశంలో రవీంద్రనాథ్, నర్సింలు, రామారావు, తిరుమలయ్య, అర్జునప్ప, జైపాల్‌రెడ్డి, ఖాజాషబ్బీర్ పాల్గొన్నారు.

సీబీఐ విచారణను స్వాగతిస్తున్నాం: ఈటల

కంటోన్మెంట్: కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతిపై విచారణను సీబీఐకి అప్పగించడాన్ని స్వాగతిస్తున్నామని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. కంటోన్మెంట్ నియోజకవర్గం మారేడుపల్లిలో జరిగిన అభివృద్ధి కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన సందర్భంగా ఆయన కాళేశ్వరం నివేదికపై స్పందించారు. రాష్ట్ర ప్రభుత్వం నియమించిన పీసీ ఘోష్ నివేదిక తప్పుల తడక అని ప్రభుత్వానికి తెలుసన్నారు. దీన్నుంచి తప్పించుకోవడానికే సీబీఐకి అప్పగించిందని పేర్కొన్నారు. సీబీఐ సంపూర్ణంగా విచారణ చేపట్టి కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన అవినీతిని వెలికి తీస్తుందనే విశ్వాసం తనకుందన్నారు.

తప్పని తిప్పలు

యూరియా కోసం అవే పాట్లు

షాబాద్: పీఏసీఎస్ వద్ద యూరియా కోసం క్యూలో నిలబడి నిరీక్షిస్తున్న రైతులు



యూరియా కోసం అన్నదాతలకు అగచాట్లు తప్పడం లేదు. ఉదయం లేచింది మొదలు పీఏసీఎస్ కార్యాలయాలకు క్యూ కడుతున్నారు. గంటల తరబడి లైన్లలో వేచి చూస్తున్నారు. మహిళా రైతులు పనులు మాని స్లిప్పుల కోసం నిరీక్షిస్తున్నారు. పలుచోట్ల అధికారులతో వాగ్వాదాలు, ఆందోళనలు కొనసాగుతున్నాయి. పోలీసు పహారాలో పంపిణీ కొనసాగుతోంది.

షాబాద్: మండల కేంద్రంలోని సహకార సంఘం కార్యాలయం ఎదుట సోమవారం ఉదయాన్నే యూరియా కోసం రైతులు బారులు దీరారు. 400 బస్తాలు రాగా క్యూలో వేచిఉండి తీసుకెళ్లారు. రైతుకు రెండు బస్తాల చొప్పున అందజేశారు.

నీరసించి.. నిలదీసి

కేశంపేట: మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో యూరియా పంపిణీ జరుగుతుందనే సమాచారంతో సోమవారం ఉదయం రైతులు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. స్లిప్పుల కోసం ఎగబడ్డారు. 450 బస్తాలు ఉండగా సుమారు 800 మంది రైతులు వచ్చారు. పీఏసీఎస్ చైర్మన్ గంద్ర జగదీశ్వర్‌గౌడ్, మండల వ్యవసాయ అధికారి శిరీషను నిలదీశారు. పరిస్థితిని గ్రహించిన వారు ఫోన్‌లో జిల్లా వ్యవసాయాధికారికి విషయం తెలియజేశారు. త్వరలో మండలానికి సరిపడా అందిస్తామని హామీ ఇచ్చారు. సీఐ నరహరి ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహించారు.



కేశంపేట: స్లిప్పుల కోసం మహిళా రైతుల నిరసన

రైతు సంఘం, సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా



ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న రైతు సంఘం, సీపీఐ నాయకులు

ఇబ్రహీంపట్నం: వ్యవసాయ శాఖ అధికారులు మొద్దు నిద్రలో ఉండడంతోనే యూరియా కోసం రైతులు అల్లాడాల్సిన పరిస్థితి వచ్చిందని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కొంతం మాధవరెడ్డి విమర్శించారు. ఇబ్రహీంపట్నం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట సోమవారం రైతు సంఘం, సీపీఐ నాయకులు ధర్నా నిర్వహించి ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పంటల సాగును అంచనా వేసి, అందుకు అనుగుణంగా యూరియా తెప్పించాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంతో రైతులకు ఈ దుస్థితి దాపురించిందని దుయ్యబట్టారు. పరిస్థితిని చక్కదిద్దడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. యూరియ కొరత తీర్చి, బ్లాక్ విక్రయాలను అరికట్టకుంటే కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా నారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి ప్రభులింగం, సీపీఐ మండల కార్యదర్శి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ వద్ద ఆందోళన

యాచారం: యూరియా కోసం సోమవారం పీఏసీఎస్ కార్యాలయానికి వివిధ గ్రామాలకు చెందిన రైతులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. తీరా రావడం లేదని తెలిసి ధర్నాకు దిగారు. సమాచారం అందుకున్న మండల వ్యవసాయాధికారి రవినాథ్ అక్కడికి చేరుకుని మంగళవారం రాత్రి వరకు వస్తుందని.. రాగానే సమాచారం ఇస్తాం, వచ్చి తీసుకెళ్లండని సూచించారు. అనంతరం రైతు వేదికలో రైతులతో సమావేశమై నానో యూరియాపై అవగాహన కల్పించారు.



యాచారం: పీఏసీఎస్ కార్యాలయం ఎదుట రైతుల ధర్నా

పక్కాగా ఓటర్ల జాబితా

- 6న ముసాయిదా ప్రకటన.. 10న తుది లిస్టు వెల్లడి
- జిల్లాలో 21 జెడ్పీటీసీ, 230 ఎంపీటీసీ స్థానాలు
- ఎన్నికలు ఎప్పుడొచ్చినా నిర్వహించేందుకు సిద్ధం
- 'సాక్షి'తో జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి



సాక్షి, రంగారెడ్డిజిల్లా: 'ఎన్నికలు ఎప్పుడు వచ్చినా.. నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నాం. పంచాయతీ ఎన్నికలు ఇతర గుర్తులపై నిర్వహిస్తే జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలకు పార్టీ గుర్తులపై ఉంటుంది. కీలకమైన ఈ ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించేందుకు ఇప్పటికే ఏర్పాట్లు చేశాం'అని జెడ్పీ సీఈఓ సీహెచ్ కృష్ణారెడ్డి చెప్పారు. ఈ మేరకు సోమవారం ఆయన 'సాక్షి'కి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆయన మాటల్లోనే..

బీసీ రిజర్వేషన్ల అంశం తేలిన వెంటనే..

జిల్లాలో 27 మండలాలు ఉండగా, వీటి పరిధిలో 21 జెడ్పీటీసీ స్థానాలతో పాటు 230 ఎంపీటీసీ స్థానాలు ఖరారయ్యాయి. 2019 ఎన్నికల్లో 257 ఎంపీటీసీ స్థానాలు ఉండగా, కొత్తగా మొయినాబాద్, చేవెళ్ల మున్సిపాలిటీలు ఏర్పాటు చేయడం, గ్రేటర్ సమీపంలోని పలు గ్రామాలను ఆయా మున్సిపాలిటీల్లో విలీనం చేయడంతో 27 ఎంపీటీసీ స్థానాలను కోల్పోవాల్సి వచ్చింది. 558 పంచాయతీలకు 32 స్థానాలను కోల్పోవాల్సి వచ్చింది. స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల అంశం తేలిన వెంటనే నోటిఫికేషన్ వెలువడే అవకాశం ఉంది.

రాజకీయ పార్టీలతో సమావేశం

526 పంచాయతీల పరిధిలో 3,99,404 మంది పురుషులు, 3,95,216 మహిళలు, 33 మంది ఇతర ఓటర్లు ఉన్నారు. ఎన్నికల కమిషన్ రెండు రోజుల క్రితం ఎంపీటీసీ, జెడ్పీటీసీ ముసాయిదా కూడా విడుదల చేసింది. ప్రతి ఎంపీటీసీ స్థానంలో కనీసం 3,500 ఓట్లు ఉండేలా జాబితా రూపొందించనున్నాం. ఈ నెల 6న ఓటర్ల జాబితాను ఆయా ఎంపీడీఓ కార్యాలయాల్లో ప్రకటించనున్నాం. 8న అన్ని రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహిస్తాం. ఏవైనా అభ్యంతరాలుంటే స్వీకరించి, పరిష్కరిస్తాం. తుది ఓటర్ల జాబితాను ఈ నెల 10న వెల్లడిస్తాం. మండల కేంద్రాలు, మేజర్ పంచాయతీల పరిధిలోనే రెండు ఎంపీటీసీ స్థానాలు ఉండే అవకాశం ఉంది. మిగిలిన చోట రెండు మూడు గ్రామాలను కలిపే అవకాశం ఉంది.

బోగస్ ఓట్లకు ఆస్కారం లేకుండా..

ఓటర్ల జాబితా తయారీలో ఎలాంటి పొరపాట్లకు ఆస్కారమివ్వబోం. బోగస్ ఓట్లకు తావు లేకుండా పక్కాగా ఓటర్ల జాబితాను రూపొందిస్తాం. గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించి ఆయా పార్టీల నుంచి వచ్చే అభ్యంతరాలను స్వీకరించి, అప్పటికప్పుడే వాటిని పరిష్కరిస్తాం. ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు కృషి చేస్తున్నాం. డివిజన్ల వారీగా జిల్లాలో రెండు విడతల్లో ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. నోటిఫికేషన్ జారీ చేసి, నామినేషన్ల స్వీకరణ తర్వాతే బ్యాలెట్ పేపర్లపై అభ్యర్థుల పేర్లు, పార్టీ గుర్తులను ముద్రించనున్నాం. ఇందుకోసం పది లక్షల బాలెట్ పేపర్లను సిద్ధంగా ఉంచాం.



❖ మహాగణపతికి మంగళహారతి

మొయినాబాద్ మండలం బాకారంలోని శివాలయంలో నెలకొల్పిన బొజ్జ గణపయ్య నిత్య పూజలు అందుకుంటున్నాడు. సోమవారం మహిళలు 101 మంగళహారతులతో ర్యాలీ నిర్వహించి గణనాథుడికి సమర్పించారు. భక్తులు ఆసక్తిగా తిలకించారు.

– మొయినాబాద్ రూరల్

❖ 'లక్ష'ణంగా ధర పలికి



మొయినాబాద్ మున్సిపల్ కేంద్రంలోని వినాయకుడి చేతిలోని లడ్డూకు నిర్వాహకులు వేలం పాట నిర్వహించారు. స్థానిక బాయ్స్ టీం రూ.6.01 లక్షలకు లడ్డూను దక్కించుకున్నారు. అనంతరం పెద్ద ఎత్తున ఊరేగింపు చేపట్టారు.

– మొయినాబాద్

కొత్త కార్డులకు రేషన్ పంపిణీ షురూ

1.50 లక్షల కొత్త కుటుంబాలకు లబ్ధి

- సన్న బియ్యం కోసం షాపుల ముందు క్యూ
- గ్రేటర్‌లో మొత్తం లబ్ధిదారులు అర కోటిపైనే..

గ్రేటర్‌లో ఆహార భద్రత కార్డులు ఇలా...

జిల్లా	కార్డులు	యూనిట్లు
హైదరాబాద్	7,15,621	26,97,665
రంగారెడ్డి జిల్లా	2,21,118	7,68,824
మేడ్చల్–మల్కాజిగిరి	4,28,293	14,90,344
సంగారెడ్డి జిల్లా	23,104	81,030



Telangana Ration Card (FSC) Apply Online

సాక్షి, సిటీబ్యూరో: ఆశావహుల పరేషాన్ వీడింది. కొత్త ఆహార భద్రత (రేషన్) కార్డుదారులకు ఉచిత బియ్యం పంపిణీ ప్రక్రియ సోమవారం ఆరంభమైంది. సుమారు లక్షన్నర కుటుంబాలకు లబ్ధి చేకూరుతోంది. మూడు నెలలుగా రేషన్‌కార్డులు మంజూరవుతున్నా నెలవారీ కోటా మాత్రం కేటాయించలేదు. పౌర సరఫరాల శాఖ పాత కార్డులకు జూన్‌లోనే ఒకేసారి మూడు నెలలు కోటా కేటాయించి పంపిణీ చేసింది. తాజాగా పాత కార్డుదారులతోపాటు కొత్త కార్డుదారులకు సైతం సెప్టెంబర్ కోటా కేటాయించి విడుదల చేసి పంపిణీ ప్రారంభించింది. కొత్త రేషన్ కార్డుదారులు ఉదయం నుంచే ప్రభుత్వ చౌకధరల దుకాణాలకు క్యూ కట్టారు.

అర్బన్‌లో 13.88 లక్షలకుపైనే కుటుంబాలు

గ్రేటర్ పరిధిలో ఆహార భద్రత కార్డులు కలిగిన కుటుంబాలు సుమారు 13.88 లక్షలపైనే కాగా, అందులో సుమారు కోటిన్నరకుపైగా లబ్ధిదారులుగా ఉన్నారు. ఒక్కో లబ్ధిదారుకు ఆరు కిలోల చొప్పున సన్న బియ్యం ప్రతి నెలా కోటా విడుదలవుతోంది. ప్రతి నెలా 15వ తేదీ వరకు సెలవు రోజు మినహా మిగతా రోజుల్లో ప్రభుత్వ చౌకధరల దుకాణాల ద్వారా సరుకులు పంపిణీ సాగుతోంది. ఈ నెల కొత్త కార్డుదారులు నెలవారీ కోటా డ్రా చేయడానికి పోటీ పడ్డారు. ఉచితంగా సన్న బియ్యం అందడంతో కొత్త కార్డుదారుల్లో ఆనందం వ్యక్తమైంది.

మాల్‌ను సందర్శించిన ఉత్తరప్రదేశ్ బృందం



పంచాయతీలో రికార్డుల నిర్వహణ గురించి తెలుసుకుంటున్న బృందం సభ్యులు

యాచారం: జాతీయ స్థాయిలో ఆత్మ నిర్భర్ నేషనల్ పంచాయతీ అవార్డు దక్కించుకున్న మాల్ గ్రామ పంచాయతీని సోమవారం ఉత్తరప్రదేశ్‌కు చెందిన ప్రజాప్రతినిధులు, అధికారుల బృందం సందర్శించింది. పంచాయతీ స్వశక్తితో ఏ విధంగా ఆర్థిక బలోపేతం అయింది.. ఇంటి పన్నుల వసూలు.. పశువుల సంత వేలం పాట ద్వారా ఏటా వచ్చే ఆదాయం.. గ్రామంలో అభివృద్ధి పనుల తీరుపై బృందం సభ్యులు అధ్యయనం చేశారు. ఈజీఎస్ నర్సరీ, పల్లెప్రకృతి వనం, పశువుల సంత స్థలాన్ని పరిశీలించారు. అనంతరం పంచాయతీ కార్యాలయంలో రికార్డుల నిర్వహణను పరిశీలించారు. కార్యక్రమంలో టీఎస్ ఐపార్డ్ అధికారులు అనిల్ కుమార్, స్మిత, ఎంపీడీఓ రాధారాణి, మండల పంచాయతీ అధికారి శ్రీలత, పంచాయతీ కార్యదర్శి రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి అర్జీలకు ప్రాధాన్యత ఇవ్వాలి



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రజావాణిలో వచ్చే అర్జీలకు ప్రాధాన్యతనిస్తూ సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ సి. నారాయణరెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో సోమ వారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి, డీఆర్‌ఓ సంగీతతో కలిసి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలించాలని అన్నారు. ఈ వారం మొత్తం 92 ఫిర్యాదులు వచ్చాయని, వాటిని సంబంధిత అధికారులు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

- కలెక్టర్ నారాయణరెడ్డి

నాణ్యమైన ఆహారం అందించాలి

హాస్టళ్లు, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందించే ఆహారాన్ని తయారు చేసే చోట వంటగది శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని, అవసరమైన మౌలిక వసతులు కల్పించాలన్నారు. ఓటరు జాబితాలో ఎలాంటి తప్పిదాలకు ఆస్కారం లేకుండా చూడాలని సూచించారు. ఈ నెల 6న గణేశ్ నిమజ్జనానికి అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

❖ కారులో కూర్చోబెట్టి.. సీటు బెల్టు పెట్టి


యాచారం మండలం తక్కళ్లపల్లి తండాలోని శ్రీ బంగారుమైసమ్మ తల్లి దేవాలయంలో వినాయకుడు ఐదు రోజుల పాటు ప్రత్యేక పూజలు అందుకున్నాడు. సోమవారం పర్వతారోహకుడు అంగోత్ తుకారాం కారులోని ముందు సీటులో గణపయ్యను కూర్చోబెట్టి సీటు బెల్టు పెట్టి జాగ్రత్తగా ఇబ్రహీంపట్నం పెద్ద చెరువుకు తరలించి నిమజ్జనం చేశాడు.

– యాచారం



ఇంటి నిర్మాణంపై బాధితుడి ఫిర్యాదు

కేశంపేట: ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని పంచాయతీ కార్యదర్శి ఆపుతున్నాడని ఆరోపిస్తూ సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా పంచాయతీ అధికారి సురేశ్‌మోహన్‌కు బాధితుడు వినతిపత్రం అందించాడు. ఈ సందర్భంగా బాధితుడు మంచర్ల కిష్టయ్య మట్లాడుతూ.. మండల పరిధిలోని మంగళిగూడలో సర్వే నంబర్ 134లో 50 సంవత్సరాల క్రితం రెండెకరాల 20 గుంటల వ్యవసాయ భూమిని ప్రభుత్వం కొనుగోలు చేసి నిరుపేదలకు ఇళ్ల స్థలాలు అందించిందన్నారు. ఇట్టి స్థలంలో 7–96 ఇంటి నంబర్‌తో ఇల్లు కూడా ఉందన్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఇళ్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసిందన్నారు. అందులో తన కవేలితో కూడిన ఇల్లు శిథిలావస్థకు చేరుకోవడంతో.. అధికారులు గుర్తించి ఇందిరమ్మ ఇంటిని తన భార్య వెంకటమ్మ పేరుపై మంజూరు చేశారన్నారు. ఇంటి నిర్మాణం పిల్లర్ల వరకు వచ్చిన


డీపీఓకు వినతిపత్రం అందిస్తున్న బాధితుడు మంచర్ల కిష్టయ్య

తర్వాత ఇంటి పక్కనే ఉండే కొట్టాం కొండల్ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌కు ఫిర్యాదు చేసినట్టు ఆయన తెలిపారు. దీంతో కార్యదర్శి ఇంటి నిర్మాణాన్ని ఆపుతున్నాడని తెలిపారు. ఇప్పటికే బేస్మెంట్ వరకు ఇందిరమ్మ బిల్లు కూడా వచ్చినట్టు బాధితుడు తెలిపారు. అధికారులు స్పందించి న్యాయం చేయాలన్నారు. ఫిర్యాదు అందించిన వారిలో గ్యార సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

గొర్ల కాపరిపై అటవీ అధికారి దాడి


పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న బాధిత కుటుంబీకులు, నాయకులు

ఎఫ్‌బీఓపై చర్యలు తీసుకోవాలంటూ బాధిత కుటుంబం ఫిర్యాదు

ఆమనగల్లు: గొర్రెల కాపరిపై దాడి చేసి, పొట్టేల్‌ను అపహరించిన అటవీ అధికారిపై చర్యలు తీసుకోవాలని బాధితుడి కుటుంబీకులు, నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఎస్‌ఐ శ్రీకాంత్‌కు ఫిర్యాదు చేశారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తలకొండపల్లి మండల కేంద్రానికి చెందిన కటికల నారాయణ.. సమీపంలోని చీపునుంతల అటవీ ప్రాంతానికి రెండు రోజుల క్రితం గొర్రెలను మేపడానికి వెళ్లాడు. ఈ సమయంలో గొర్రెలు ఫారెస్టు ఏరియాలోకి వచ్చాయని పేర్కొంటూ.. ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ మహ్మద్ అబ్దుల్ అజీజ్.. కాపరిపై దాడిచేసి గాయపరిచి, మందలో నుంచి గొర్రె పొట్టేల్‌ను తీసుకెళ్లాడు. దీంతో ఆ అధికారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ.. పోలీసులను ఆశ్రయించారు. ఇందులో బాధితుడి కుటుంబీకులు, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రవీందర్ యాదవ్, నాయకులు శేఖర్‌యాదవ్, జంగయ్య, పాండు, మల్లేశ్, రాజు, చెన్నయ్య ఉన్నారు.

పంటల నమోదు తప్పనిసరి

ఏడీఏ శంకర్ రాథోడ్

కొడంగల్ రూరల్: రైతులు తాము సాగుచేసిన పంటల వివరాలను వ్యవసాయశాఖ కార్యాలయంలో నమోదు చేయించుకోవాలని కొడంగల్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు(ఏడీఏ) శంకర్ రాథోడ్ సూచించారు. సోమవారం కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలోని కొడంగల్, బొంరాస్‌పేట, దుద్యాల్, దౌల్తాబాద్ మండలాల్లోని రైతులు తాము సాగుచేసిన పంటల వివరాలను సెప్టెంబర్ 1వ తేదీ నుంచి నవంబర్ 1వ తేదీ వరకు గ్రామాల వారీగా, సర్వే నంబర్ వారీగా తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని తెలిపారు. పంట నమోదు ఆధారంగానే ప్రభుత్వం పంటల కొనుగోలు, రైతులకు పంట నష్ట పరిహారం, రైతు భరోసా వంటి ప్రభుత్వ పథకాలను పొందేందుకు వీలుంటుందని చెప్పారు. గ్రామాల్లో వ్యవసాయ విస్తరణ(ఏఈఓ) అధికారులను సంప్రదించాలని పేర్కొన్నారు.

పంటల నమోదు చేసుకోవాలి

పూడూరు: రైతులు వేసుకున్న పంటలను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని పూడూరు మండల వ్యవసాయ అధికారి తులసీరాం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 25 వరకు మండల రైతులు తమ క్లస్టర్ల పరిధిలోని రైతువేదికలో వ్యవసాయ విస్తరణ అధికారులు అందుబాటులో ఉంటారని చెప్పారు.


వృద్ధురాలిని ఇంటికి చేర్చిన పోలీసులు

ఆమనగల్లు: మానసిక స్థితి సరిగా లేని వృద్ధురాలిని గుర్తించిన పోలీసులు.. ఆమెను కుటుంబ సభ్యుల చెంతకు చేర్చారు. తలకొండపల్లి ఎస్‌ఐ శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని గ్రామీణ వికాస్ బ్యాంక్ వద్ద ఓ వృద్ధురాలు పడి ఉందని ఆదివారం రాత్రి 7 గంటలకు పోలీసులకు సమాచారం అందింది. దీంతో వారు బ్యాంకు వద్దకు చేరుకుని, వివరాలు తెలుసుకునే యత్నం చేశారు. అయితే ఆమె చెప్పలేని స్థితిలో ఉండటంతో.. సంచిని తినిఖీ చేయగా అధారం కార్డు లభించింది. పేరు మారమ్మ, మిడ్జిల్ మండల కేంద్రంగా గుర్తించి, కుటుంబీకులకు అప్పగించారు.


గ్రామీణ వికాస్ బ్యాంక్ వద్ద వృద్ధురాలితో పోలీసులు


పోక్సో కేసులో నిందితుడికి జైలు శిక్ష

పహాడీషరీఫ్: పోక్సో కేసులో నిందితుడికి న్యాయస్థానం మూడేళ్ల జైలు శిక్ష విధించింది. పోలీసుల కథనం ప్రకారం.. మహారాష్ట్రకు చెందిన ముఖేష్(23).. తుక్కుగూడ మంఖాల్‌కు వలస వచ్చాడు. 2024లో ఓ బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. అప్పట్లో నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసిన పోలీసులు.. ఎల్బీనగర్ కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. తాజాగా సోమవారం కేసు విచారించిన న్యాయమూర్తి.. నిందితుడికి మూడేళ్ల జైలు శిక్షను విధిస్తూ తీర్పును వెలువరిచారు. బాధితురాలికి రూ.50 వేల నష్ట పరిహారం ప్రకటించారు.


ముఖేష్

యువకుడి ఆత్మహత్య

ఆమనగల్లు: కుటుంబ కలహాలతో ఓ యువకుడు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన తలకొండపల్లి మండలం అంతారం గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కృష్ణయ్య(35)కు 12 సంవత్సరాల క్రితం విజయతో వివాహం అయింది. వీరికి ఒక కుమారుడు ఉన్నాడు. కొంత కాలంగా దంపతుల మధ్య గొడవలు జరగగా.. పలుమార్లు పెద్దల సమక్షంలో పంచాయితీ నిర్వహించి, సఖ్యతగా ఉండాలని సూచించారు. సోమవారం ఉదయం ఇరువురి మధ్య మరోసారి గొడవ జరిగింది. ఈ క్రమంలో విజయ కూలిపనులకు వెళ్లగా.. ఇంట్లో ఎవరూ లేనిసమయంలో కృష్ణయ్య ఇంటి పైకప్పు గొట్టానికి ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. మృతుడి సోదరుడు మల్లేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని పోలీసుల తెలిపారు.


కృష్ణయ్య(ఫైల్)

ప్రమాదవశాత్తు రిటైర్డ్ హెచ్‌ఎం మృతి

దోమ: మండల కేంద్రానికి చెందిన రిటైర్డ్ హెచ్‌ఎం చుక్కన్నగారి బిచ్చిరెడ్డి(80)సోమవారం మృతి చెందారు. వికారా బాద్, దోమ, పరిగి, నస్కల్ ఉన్నత పాఠశాలల్లో పనిచేసిన ఆయన సోమవారం తన వ్యవసాయ క్షేత్రంలో కూలీలతో మొక్కలు నాటిస్తుండగా కాలు జారి కింద పడిపోయారు. తలకు బలమైన గాయం కావడంతో వెంటనే ఆస్పత్రికి తరలించగా, పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు.

డీజేలు వినియోగిస్తే కేసులు

సీఐ భీంకుమార్

అనంతగిరి: వికారాబాద్ లో జరిగే నిమజ్జనోత్సవంలో డీజేలకు అను మతి లేదని వికారాబాద్ టౌన్ సీఐ భీంకుమార్ సోమ వారం ఓ ప్రకటనలో తెలిపారు. డీజేలు వినియోగిస్తే డీజే యాజమాని, నిమజ్జనం ఆర్గనైజర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఆదివారం రాత్రి వికారాబాద్ పట్టణంలోని కమలానగర్ ఏరియాలో వినాయక నిమజ్జనం సందర్భంగా కొందరు వ్యక్తులు గొడవకు దిగి అక్కడి ప్రజల శాంతికి భంగం కలిగించారు. వారిపైన క్రిమినల్ కేసులు నమోదు చేశామన్నారు. నిమజ్జనం శాంతియుతంగా నిర్వహించుకోవాలని సూచించారు.

బంధాలు మరచి.. కత్తులు దూసి

- హత్యలకు దారితీస్తున్న ఆస్తి తగాదాలు, ప్రేమ వ్యవహారాలు
- ఆందోళన కలిగిస్తున్న వరుస సంఘటనలు
- ఆదివారం దండుమైలారంలో దారుణం
- 11 గుంటల భూ పంచాయతీలో ఇరువర్గాల దాడి
- ఒకరి మృతి, చావుబతుకుల మధ్య మరొకరు


దండుమైలారంలో రోడ్డుపై బైఠాయించిన బాల్‌రాజ్ బంధువులు

ఇబ్రహీంపట్నం: ఆస్తి తగాదాలు, ప్రేమ వ్యవహారాలే దారుణ హత్యలకు దారి తీస్తున్నాయి. రక్త సంబంధాన్ని మరచి, దాడులకు పాల్పడుతున్న సంఘటనలు ఇటీవల తరచూ చోటుచేసుకొంటున్నాయి. గతేడాది రాయపోల్ గ్రామంలో ఓ మహిళా కానిస్టేబుల్.. అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తిని ప్రేమించి పెళ్లి చేసుకుంది. ఇది సహించని సోదరుడు.. ఆమెను నడిరోడ్డులో హతమార్చాడు. తల్లిదండ్రులు లేని ఆ కుటుంబంలో ఉన్న ఒక్క తోడును కడతేర్చి, అతను జైలు పాలయ్యాడు.

కన్నతల్లి చేతిలో తనయ..

దండుమైలారంలో అదే సంవత్సరంలో కూతురు ప్రేమ వ్యవహారంపై కన్నతల్లి నిలదీసింది. ఈ సంఘటనలో తనయ.. తల్లి చేతిలో ప్రాణాలు కోల్పోయింది. క్షణికావేశంలో జరిగిన ఘటనలో కూతురిని కోల్పోయి, కేసుల్లో చిక్కుకొని ఆ కుటుంబం అల్లాడిపోయింది. మూడేళ్ల క్రితం కర్ణంగూడ, చర్లపటేల్ గూడ పరిధి పెద్ద చెరువు సమీపంలో భూ తగాదాలో నగరానికి చెందిన ఇద్దరు వ్యక్తులు హత్యకు గురయ్యారు. ఈ ఘటనలోని నిందితులు జైలు పాలయ్యారు. ఇటీవల గున్‌గల్‌లో ఇంటి పక్క ఉన్న ఓ డ్రైనేజీ గొడవ ఓ హోంగార్డును బలి తీసుకుంది.

11 గుంటల భూమి కోసం..

పై హత్యోదంతాలు మరువక ముందే.. కేవలం 11 గుంటల భూ తగాద.. ఇరు కుటుంబాల్లో తీవ్ర విషాదం నింపింది. ఆదివారం దండుమైలారం గ్రామ శివార్లలో దాయాదులే గొడ్డళ్లు, కత్తులతో దారుణంగా దాడులు చేసుకున్నారు. ఈ దాడుల్లో బాల్‌రాజ్ అనే వ్యక్తి మృత్యువాత పడగా.. మరో మహిళ మంజుల చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతోంది. మరో ఐదుగురు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వీరంతా ఒకే కుటుంబంలోని అన్నదమ్ముల వారసులు. భవిష్యత్తు పరిణామాలను అంచనా వేసుకోకుండా, క్షణికావేశంలో జరుగుతున్న హత్యలతో ఆయా కుటుంబాలు ఎంతో నష్టపోతున్నాయి.

ముగిసిన బాల్‌రాజ్ అంత్యక్రియలు

దాయాదుల చేతిలో హతుడైన బాల్‌రాజ్ అంత్యక్రియలు సోమవారం దండుమైలారం గ్రామంలో ఉద్రిక్తత నడుమ ముగిశాయి. ఉదయం నుంచి మృతుడి బంధువులు గ్రామంలో రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని నిరసన వ్యక్తంచేశారు. ఏసీపీ కేపీవీ రాజు, సీఐ మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో.. ఎస్‌ఐలు, పోలీసు బలగాలను ఆ గ్రామంలో భారీ సంఖ్యలో మోహరించి పరిస్థితి చేజారకుండా పర్యవేక్షించారు. మృతుడి కుటుంబానికి గ్రామ పెద్దలు, పోలీసులు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో రెండు ఎకరాల భూమిని బాధిత కుటుంబాలకు ఇచ్చేందుకు ప్రత్యర్థి వర్గం ఒప్పుకున్నట్లు సమాచారం. పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించడంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోలేదు.


ఆస్పత్రిలో మృత్యువుతో పోరాడుతున్న మంజుల

ఉపాధ్యాయుల డిప్యూటేషన్ రద్దు చేయండి


కలెక్టర్ నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న నక్కర్తమేడిపల్లి గ్రామస్తులు

యాచారం: నక్కర్తమేడిపల్లి ఉన్నత పాఠశాల నుంచి వెళ్లిన ఉపాధ్యాయుల డిప్యూటేషన్‌ను వెంటనే రద్దు చేయాలని ఆ గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ నారాయణ రెడ్డికి వినతిప్రతం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. విద్యా సంవత్సరం మధ్యలో టీచర్లు బదిలీపై వెళితే.. పిల్లల భవిష్యత్తు ఏం కావాలని ప్రశ్నించారు. పాఠశాలను ఎంత అభివృద్ధి చేసినా.. ఉపాధ్యాయులు లేకపోతే విద్యార్థులకు మెరుగైన విద్య ఎలా అందుతుందని వాపోయారు. దీనికి స్పందించిన కలెక్టర్.. విద్యాశాఖ అధికారులతో మాట్లాడి, న్యాయం చేస్తానని హామీ ఇచ్చినట్లు వారు పేర్కొన్నారు. గ్రామస్తులు బోడ కృష్ణ, రవీందర్‌గుప్తా, నరేష్, శ్రీశైలం, నాగరాజు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

జంతువుల దాడి.. 23 మేక పిల్లలు మృతి


మేకల కళేబరాలను పరిశీలిస్తున్న పశు వైద్యాధికారి తదితరులు

కందుకూరు: గుర్తు తెలియని జంతువుల దాడిలో మేక పిల్లలు మృత్యువాత పడ్డాయి. ఈ సంఘటన మండల పరిధి సరస్వతిగూడ గ్రామంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మాదరబోని అంజయ్య.. ఆదివారం మేక పిల్లలను దొడ్డిలో ఉంచి, పెద్దవి గొర్లు, మేకలను మేత కోసం సమీప అటవీ ప్రాంతానికి తీసుకెళ్లాడు. సాయంత్రం తిరిగి వచ్చే సరికి దొడ్డిలోని 23 మేక పిల్లలు విగతజీవిగా పడున్నాయి. వాటి గొంతు కొరకడంతోనే మృతి చెందినట్లుగా గుర్తించారు. ఇది కుక్కల పనా, లేక ఏదైనా జంతువు చేసిందా అనేది అధికారులు నిర్ధారించాల్సి ఉంది. ఘటనా స్థలాన్ని పశువైద్యాధికారి డాక్టర్ సంధ్యారాణి, పంచాయతీ కార్యదర్శి కన్యాకుమారి పరిశీలించారు. బాధితుడికి మార్కెట్ కమిటీ డైరెక్టర్ కంబాలపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేశారు.

గోరీలు ధ్వంసం!


డబిల్‌గూడలోని దళితుల గోరీలు (ఫైల్)


గోరీలను ధ్వంసం చేసి అస్తికలు మాయం చేసిన ప్రదేశం

- బొందల్లోని అస్తికలు మాయం
- డబిల్‌గూడలో ఘటన
- పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితులు

మహేశ్వరం: దళితుల శ్మశానవాటికలోని గోరీలను కూల్చేసి, బొందలు తవ్వి, అందులోని అస్తికలను మాయం చేశాడు ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి. ఈ సంఘటన మండల పరిధిలోని డబిల్‌గూడలో సోమవారం చోటు చేసుకుంది. గ్రామస్తుల వివరాల ప్రకారం.. డబిల్‌గూడ దళిత కుటుంబానికి చెందిన జెన్నపాగ కుటుంబ సభ్యులు సర్వేనంబర్ 24లోని సొంత వ్యవసాయ భూమిలో ఖననం చేశారు. ఈ స్థలాన్ని వదిలేసి 2006లో హైదబాద్‌కు చెందిన ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారికి భూమిని విక్రయించారు. ఈ భూమి ముగ్గురి చేతులు మారి ప్రస్తుతం రవివర్మ అనే వ్యక్తి పేరున ఉంది. శ్మశాన వాటిక స్థలంలో అప్పటికే గోరీలు నిర్మించారు. వీటిని తొలగించాలని కొద్ది రోజులుగా ప్రణాళిక వేస్తున్న ఆయన ఆదివారం అర్ధరాత్రి తన అనుచరులతో గోరీలను తవ్వేసి, అందులోని అస్తికలను మాయం చేశారు. సోమవారం తెల్లవారుజామున ఇది గమనించిన బాధిత కుటుంబ సభ్యులు బోరున విలపించారు. కనీస సమాచారం ఇవ్వకుండా, తమ పొలంలోని గోరీలను ధ్వంసం చేయడంతో పాటు అస్తికల ఆనవాళ్లు కూడా లేకుండా చేశారని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ దుశ్చర్యకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జెన్నపాగ బాలమణి, అంజమ్మ, బాబు, రాములు తదితరులు డిమాండ్ చేశారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రీజినల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ మార్చాలి

పీఏసీఎస్ మాజీ చైర్మన్ నర్సింహారెడ్డి

పూడూరు: రీజినల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ మార్చి రైతులకు న్యాయం చేయాలని పీఏసీఎస్ మాజీ చైర్మన్ పట్లోళ్ల నర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మండల కేంద్రంలో బాధిత రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్చడంతో రైతులకు అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. గతంలో గ్రామం సమీపం నుంచి తిప్పాపూర్ ఫారెస్టు మీదుగా రోడ్డు వస్తుందని చెప్పి ప్రభుత్వం సర్వే నంబర్లను విడుదల చేయడంతో రైతులు తమ బతుకులు ప్రశ్నార్థకంగా మారాయన్నారు. ఉన్న ఎకరా కోల్పోతే ఎలా జీవనం సాగించాలని ఆందోళన చెందుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు తాజొద్దీన్, శ్రీనివాస్, మల్లయ్య పాల్గొన్నారు.


పాత పెన్షన్ పునరుద్ధరించండి

ఎస్‌టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్

కొడంగల్ రూరల్: టీజీఈ జేఏసీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సంఘాలు సెప్టెంబర్ 1వ తేదీని పెన్షన్ విద్రోహ దినంగా పాటిస్తున్నట్లు ఎస్‌టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్ అన్నారు. సోమవారం టీజీఈ జేఏసీ పిలుపు మేరకు రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాల్లోని కలెక్టరేట్ వద్ద నిరసనలు వ్యక్తం చేసేందుకు ఆయా సంఘాల నాయకులు తరలివెళ్లారని పేర్కొన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో సీపీఎస్ విధానాన్ని ప్రవేశపెట్టి పాత పెన్షన్‌ను తొలగించడం దారుణమన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు పదవీ విరమణ అనంతరం పెన్షన్ లేక పోవడం తీవ్ర నష్టానికి గురి అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఎస్‌ను రద్దు చేస్తూ పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

ఆడుకుంటూ.. ఆటో చక్రాల కింద నలిగి

- 16 నెలల బాలుడి దుర్మరణం
- కన్నీటి పర్యంతమైన తల్లిదండ్రులు


లోహిత్ మృతదేహం

అబ్దుల్లాపూర్‌మెట్: అప్పటిదాకా బంతితో ఆడుకున్న బాలుడు.. అంతలోనే తండ్రి ఆటో చక్రాల కింద నలిగి మృత్యువాత పడ్డాడు. ఆటోను వెనుకకు తీస్తున్న క్రమంలో బాలుడిని గమనించని నరేష్.. అలాగే వెళ్లడంతో తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఈ సంఘటన పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేటకు చెందిన కళ్లెం నరేష్, అతని భార్య, పిల్లలతో కలిసి మండల కేంద్రంలోని ఎస్‌బీఐ బ్యాంకు ఎదురుగా నివాసముంటూ ఆటోనడుపుకొంటూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం ఉదయం 8 గంటలకు ఇంటి ఎదుట ఆటోను వెనుకకు తీస్తుండగా.. అతని 13 నెలల కుమారుడు లోహిత్ ఆడుకుంటూ వెనుక నుంచి ఆటో కిందకి వచ్చాడు. ఇది గమనించని నరేష్.. ఒక్కసారిగా ఆటోను వెనుకకు తీయగా.. బాలుడి తలపై నుంచి వెళ్లింది. తీవ్రగాయాలతో లోహిత్ చనిపోయాడు. దీంతో ఒక్కసారిగా షాక్ గురైన తల్లిదండ్రులు.. కళ్లముందు ఆడుకుంటున్న పసివాడి ప్రాణాలు క్షణాల్లో గాలిలో కలిసి పోవడంతో కన్నీటి పర్యంతమయ్యారు. బాలుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు, దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియాకు తరలించారు.

ట్రాఫిక్ సీఐపై యువకుడి వీరంగం

ఆదిబట్ల పీఎస్‌లో కేసు నమోదు

ఇబ్రహీంపట్నం రూరల్: విధి నిర్వహణలో ఉన్న ట్రాఫిక్ సీఐపై ఓ యువకుడు దురుసుగా ప్రవర్తించిన సంఘటన సోమవారం ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ రవికుమార్ కథనం ప్రకారం.. ఇబ్రహీంపట్నం ట్రాఫిక్ సీఐగా పని చేస్తున్న నర్సింహారెడ్డి, ఆదివారం రాత్రి వినాయక నిమజ్జనం కార్యక్రమంలో భాగంగా తుర్కయంజాల్ మాసబ్‌చెరువు కట్టపై విధులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా వాహనాలు రోడ్డు మీద నుంచి తీయాలని చెప్పడంతో.. మన్సూరాబాద్‌కు చెందిన శరత్‌కుమార్, నీవెవరు నేను తీయను అని దురుసుగా ప్రవర్తించాడు. దీంతో అతన్ని ఠాణాకు తీసుకెళ్లగా.. పోలీస్‌స్టేషన్‌లో ఆత్మహత్య చేసుకుంటునానని గందరగోళం సృష్టించాడు. ఈ నేపథ్యంలో విధులకు ఆటంకం కలిగించడంతో పాటు, దురుసుగా ప్రవర్తించిన శరత్‌కుమార్‌పై.. ట్రాఫిక్ సీఐ నర్సింహారెడ్డి, ఆదిబట్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదు మేరకు కేసు నమోదు, చేసి విచారణ చేస్తున్నామని సీఐ తెలిపారు.

నిమజ్జనానికి ఏర్పాట్లు పూర్తి

పరిగి: వినాయక నిమజ్జనాలు ప్రశాంతంగా సాగేలా ప్రతీ ఒక్కరు సహకరించాలని పరిగి మున్సిపల్ కమిషనర్ వెంకటయ్య కోరారు. సోమవారం ఆయన మండల పరిధిలోని లక్నాపూర్ ప్రాజెక్టును సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లక్నాపూర్ ప్రాజెక్టులో గణేశ్ నిమజ్జనానికి కావాల్సిన ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.

ఒడిశా టు హైదరాబాద్

- ఆర్టీసీ బస్సులో గంజాయి తరలింపు
- పోలీసులకు దొరికిన నిందితులు


పోలీసుల అదుపులో నిందితులు


పట్టుబడిన గంజాయి ప్యాకెట్లు

ఇబ్రహీంపట్నం రూరల్: ఒడిశా నుంచి హైదరాబాద్‌కు గుట్టు చప్పుడు కాకుండా ఆర్టీసీ బస్సుల్లో గంజాయి తరలిస్తున్న ముఠాను.. ఆదిబట్ల, మహేశ్వరం జోన్ ఎస్‌ఓటీ, పోలీసులు సంయుక్తంగా పట్టుకున్నారు. ఈ సంఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. సీఐ రవికుమార్ కథనం ప్రకారం.. ఒడిశా రాష్ట్రానికి చెందిన దేబ కబాసి(35) అనే వ్యక్తి, వరుసకు అక్క అయ్యే జోగి మడకమి(42) ఇద్దరు కలిసి గత రెండు రోజుల క్రితం ఒడిశా నుంచి హైదరాబాద్‌కు గంజాయి తరలించేందుకు ప్లాన్ చేసుకున్నారు. అక్కడి నుంచి ఆర్టీసీ బస్సులో చింతూరు మీదుగా భద్రాచలంలో దిగి, మరో బస్సులో ఎల్బీనగర్‌కు చేరుకున్నారు. బొంగ్లూర్ సెంట్రింగ్ పని చేసుకుంటూ జీవించే దేబ కబాసి.. తమ్ముడు అర్జున్‌కు ఫోన్ చేసి, బొంగ్లూర్ వస్తున్నామని చెప్పడంతో బస్సు దిగగానే ఫోన్ చేయమని అర్జున్ చెప్పాడు. వారు దిగగానే వారి దగ్గరకు వచ్చిన అర్జున్.. సంచుల్లో ఏముందని అడగడంతో గంజాయి ఉందని కబాసి, జోగి చెప్పారు. దీంతో అర్జున్ భయపడి వెళ్లిపోయాడు. విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని సోదా చేయగా.. 10 కేజీల గంజాయి ప్యాకెట్లు లభించాయి. వాటిని స్వాధీనం చేసుకొని, నిందితులను రిమాండ్‌కు తరలించామని సీఐ తెలిపారు. కాగా.. వారి వద్ద దొరికిన గంజాయిని ఒడిశాలోని మల్కాన్‌గిరిలో పలాసి నూకరాజు వద్ద రూ.2.50 లక్షలకు కొనుగోలు చేసినట్లు విచారణలో తేలింది.